# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 27, అక్టోబర్ 2025


### సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన

## ఉద్యోగ మేళాలో 3,500 మందికి ఉపాధి

◆ ఉద్యోగ మేళాకు విశేష స్పందన ◆ ఉద్యోగ మేళాకు 6800 మంది హాజరు

**బెల్లంపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

స్వయంకృషి ఉంటేనే యువకులు స్వంతంగా ఉద్యోగాలు సాధిస్తారని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏఎంసీ నెంబర్2 క్రీడామైదానంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారం నోబల్ ఏద్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిగతా 2లో..






## లక్కీడ్రా కిక్కు ఎవరికో..



### నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

**ఆసిఫాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

నూతన మద్యం పాలసీ 2025-27లో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని 32 మద్యం దుకాణలకు సోమవారం లక్కీ డ్రాను నిర్వహించేందుకు అబ్కారి శాఖ కసరత్తులు చేసింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 23 వరకు 28 రోజులు పాటు జిల్లా కేంద్రంలో నిర్వహించిన 32 మద్యం దుకాణాలకు గాను 680 దరఖాస్తులను స్వీకరించారు. వీటికి గాను రాష్ట్ర ప్రభుత్వంకు దరఖాస్తుల రూపంలో జిల్లా నుంచి రూ. 20.40 కోట్ల రాబడి వచ్చింది. మద్యం పాలసీ 202325 గాను జిల్లా నుంచి 1020 దరఖాస్తులు రాగా రాబడి 20.40 కోట్ల రాబడి వచ్చింది. అంటే దరఖాస్తుల పరంగా 340 తక్కువగా వచ్చినా రాబడిలో ఏ మాత్రం తేడా లేదు. దీనికి కారణం దరఖాస్తు రుసుము. గతంలో రూ. 2 లక్షలు ఉండగా ఈ ఏడాది ప్రభుత్వం మరో రూ. 1 లక్ష జోడించి రూ. 3 లక్షలకు మిగతా 2లో..



## అకాల వర్షాలు.. అన్నదాతల ఆర్తనాదాలు



### ☆ తడిసి ముద్దయిన మొక్కజొన్న, పత్తి పంటలు

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అకాల వర్షాల వల్ల భారీగా పంట నష్టం వాటిల్లుతుంది. చేతికి వచ్చిన పంటలను ఆరబట్టి యత్నంలో వాటిని కాపాడుకోవడానికి రైతులు పారీలు కప్పే ప్రయత్నం చేసిన భారీ వర్షం పడడంతో నీరు క్రిందికి వెళ్లి పూర్తిగా పాడైపోతున్నాయి. మొక్కజొన్న, సోయాబీన్ ఆరబెట్టిన చోటే వర్షార్పనం అవుతున్నాయి. వర్షానికి తడిసి ముద్ద కావడం జరిగింది. రైతులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటుంన్నారు. పత్తి పంట అయితే మరీ దారుణంగా మారింది. పత్తి పంట ఒకప్పుడు అన్నదాతల పాలిట బంగారు కాసులు తెచ్చిపెట్టింది. కానీ ఇప్పటి పరిస్థితులు మాత్రం రైతులను మిగతా 2లో..

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



**తాండూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శివ భక్త మార్కండేయ ఆలయం సమీపంలో ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను తాండూర్ మండల టాక్టర్స్ యూనియన్ నాయకులు పట్టుకున్నారు. రెబ్బెన నుంచి ఇసుకను తాండూర్ మండలానికి అక్రమంగా తరలిస్తూ తమ పొట్టను కొడుతున్నారని యూనియన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి, పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తాండూర్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు.

## కాగజ్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్.. 55 బైకులు సీజ్



**కాగజ్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త**

శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణ లక్ష్యంగా కాగజ్‌నగర్ సంజీవయ్య కాలనీలో ఆదివారం పోలీసులు భారీ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎస్పీ వహీదుద్దిన్ పర్యవేక్షించగా, టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్, కళ్యాణ్ నేతృత్వంలో సుమారు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం సమాజానికి ముప్పు కాబట్టి యువత వాటి నుంచి దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.గ్రామాల్లో అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులపై ప్రజలు వెంటనే డయల్ 100 ద్వారా సమాచారమివ్వాలని, కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 55 బైకులను పోలీసులు సీజ్ చేశారు.



## తెలంగాణ రైసింగ్ 2047 సమిష్టిగా సాధిద్దాం

### ✻ కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

తెలంగాణ రైసింగ్ 2047 లక్ష్యాన్ని రాష్ట్ర యువత సమిష్టిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఎఎంసి మైదానంలో సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, సింగరేణి సంస్థ డైరెక్టర్ (పి.పి.) కె.వెంకటేశ్వర్లు, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా 2లో..

### సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన

# ఉద్యోగ మేళాలో 3,500 మందికి ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. బెల్లంపల్లి ప్రాంతంలో చదువుకున్న నిరుద్యోగ యువకులు తప్పుదారి పట్టకుండా ఉపాధి వైపు వెళ్లేందుకు సింగరేణి సంస్థ ప్రయివేట్ కంపెనీలతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. సింగరేణి నాడు 1992లో నష్టాల ఊబిలో కూరుకుపోయి బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లే క్లిష్ట పరిస్థితుల్లో సింగరేణి సంస్థకు నాటి దివంగత కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి నాటి ప్రధాని పీవీ నరసింహారావుతో మాట్లాడి రూ. 650 కోట్ల మారిటోరియం ఇప్పించి సింగరేణి సంస్థను కాపాడిన ఘనత కాకా వెంకటస్వామిదేనన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ యువకుల్లో పట్టుదల ఉంటేనే ఉద్యోగాలు సాధిస్తారని అన్నారు. చిన్న ఉద్యోగం సాధించి పెద్ద ఉద్యోగం కోసం యువకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సింగరేణి సంస్థ ప్రాజెక్ట్ ప్లానింగ్ డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 140 ఏళ్ల చరిత్ర గల సింగరేణి సంస్థ ఆశయం సమాజ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. సింగరేణి సంకల్పం సమాజం అభివృద్ధి చెందాలనేదేనన్నారు. నేడు బెల్లంపల్లి, మధిర, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, మణుగూరు లాంటి పట్టణాల్లో జాబ్ మేళాలు నిర్వహించి ఇప్పటికి 20 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందనారు. జాబ్ మేళాకు విశిష్ట అతిధిగా హాజరైన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఎంపీ తెలిపారు. బెల్లంపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాకు 6,800 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 70 కంపెనీలు 3,500 మందికి ఉద్యోగాలు సాధించారాని ఎంపీ అన్నారు. రానున్న రోజుల్లో పెద్దపల్లి ప్రాంతంలో జాబ్ మేళా నిర్వహించాలని ఎంపీ సింగరేణి యజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బొబల్ ఏద్యుకేషనల్ ఎంపవర్ మెంట్ సొసైటీ వ్యవస్థాప అద్యక్షులు డి. సురేష్ కుమార్, స్టేట్ మేనేజర్ గోగర్ల శోభన్ బాబు లు మాట్లాడారు. బెల్లంపల్లిలో నిర్వహించిన జాబ్ మేళా కు ఆన్ లైన్ ద్వారా 9,500 మంది నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారని వారు పేర్కొన్నారు. 6,800 మందికి టోకెండ్లు జారీ చేశామని తెలిపారు. 3,500 మందికి ఉద్యోగాలు వివిధ కంపెనీల్లో ఇవ్వటం జరిగిందన్నారు. మందమర్రి



ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాదాకృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లిలో నిర్వహించిన జాబ్ మేళా కు ఊహించని రీతిలో స్పందన లభించిందన్నారు. జాబ్ మేళా విజయువంతమైందన్నారు. డీసీపీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ సంకల్ప బలం ఉంటేనే యువకులు ఉద్యోగాలు సాధిస్తారన్నారు. ఉద్యోగాల కోసం కృషిచేసే నిరుద్యోగ యువకులు ఉపాధి విషయంలో తమను సంప్రదిస్తే ప్రయివేట్ కంపెనీలతో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషిచేస్థామన్నారు. జాబ్ మేళాల్లో పాల్గొంటేనే ఉద్యోగాలకు యువకులు అడుగులు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలెండ్ల సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, ఎస్ఓటూ జీఎం ఆర్. విజయప్రసాద్, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ ఎస్. రమేష్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాం సుందర్, శాంతిఖని ప్రాజెక్ట్ అధికారి అబ్దుల్ కదీర్, సివిల్ ఎస్ ఈ బీ రాము, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవత్ ఝా, వేలాది మంది నిరుద్యోగులు హాజరయ్యారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**తాండూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందిన తాండూర్‌కు చెందిన ఫోటో గ్రాఫర్ పంబాల రమేష్ కుటుంబానికి ఆదివారం ఫోటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ కుటుంబ భరోసా నుంచి రూ 10 వేలు ఆర్థిక సాయం అందించారు. గత సంవత్సరం రూ 1,60 లక్షలు అందించగా వారి ఇద్దరు మైనర్ పిల్లల చదువు కోసం రాష్ట్ర అసోసియేషన్ నుంచి వచ్చిన రూ.10 వేలను ఫోటోగ్రాఫర్స్ సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, కుటుంబ భరోసా ఇంచార్జి నూనె సురేష్, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు రాజబాబు, బెల్లంపల్లి అధ్యక్షుడు ఆకుల వేణు, తాండూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శోభన్, సభ్యులు రుకుం ప్రసాద్, శివ పాల్గొన్నారు.



# అకాల వర్షాలు.. అన్నదాతల ఆర్తనాదాలు

(మొదటిపేజీ తరువాయి)

నిండా ముంచుతున్నాయి. పెట్టుబడులు పెరిగాయి దిగుబడులు తరిగాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల కొన్ని భూముల్లో ఏపుగా పెరిగాయి, కొన్ని భూములలో పూర్తిగా నీరుగారిపోయాయి. పెరిగిన వాటిలో కాయలు పూత అంతంత మాత్రంగాని ఉంది. ఉన్నవాటిలో చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షాలకు పత్తి పంట తడిసి ముద్దవుతున్నాయి. వర్షాల వల్ల పంట నాణ్యత క్షీణించడం, కాయలు తడిసి నల్లబడి దీనివల్ల మార్కెట్‌లో వాటి విలువ తగ్గిపోతుంది. మొత్తానికి రైతుల కంట నీరే మిగిలింది.





# తెలంగాణ రైసింగ్ 2047 సమిష్టిగా సాధిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ రైసింగ్ 2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అభివృద్ధి చేసి దేశంలో ననంబర్ 1 స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర యువత సమిష్టిగా కలిసి రావాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి అధునాతన సాంకేతిక వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కొరకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అనేక కోర్సులలో నైపుణ్య శిక్షణ అందిస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్య శిక్షణతో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వృత్తి విద్య కోర్సుల ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలను పరుస్తుందని, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగం పొందిన వారు తమ రంగంలో నైపుణ్యత సాధించాలని తెలిపారు. యువత రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం జాబ్ మేళా కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు.

# లక్కీడ్రా కిక్కు ఎవరికో..

(మొదటిపేజీ తరువాయి)

పెంచింది. దరఖాస్తు రుసుము ఎక్కువ కావడంతో ఔత్సహికులు చొరవ చూపకపోవడంతో ఈ ఏడాది మద్యం దుకాణాలకు దరఖాస్తులు తక్కువ వచ్చాయి. ఇట్టి మద్యం దుకాణాలకు ఈ నెల 27 అనగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సమక్షంలో లక్కీ డ్రాను పకడ్బందీగా నిర్వహించేదుకు చర్యలు తీసుకున్నారు. దరఖాస్తుదారులు ఉదయం 9.00 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని అబ్కారి శాఖ అధికారులు తెలిపారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

**బెజ్జూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**



బెజ్జూర్ మండలంలోని కుష్ణపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. సండే లక్షుఋఋఋణ్, సెండే లక్ష్మి, నికాడి నిర్మల అనే ముగ్గురు ఇందర్గాం గ్రామం నుంచి బైకుపై బెజ్జూర్‌కు వెళుతున్న క్రమంలో కుష్ణపల్లి గ్రామానికి చెందిన కొడిపే విజయ్ అనే యువకుడు బైకుపై వస్తున్న క్రమంలో గ్రామానికి సమీపంలో రెండు బైకులు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో బైకు నడుపుతున్న సెండే లక్షుఋఋఋణ్, కొడిపే విజయ్‌లకు తీవ్ర గాయాలు కాగా వారిని కరీంనగర్‌కు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరికి మంచిర్యాలలో చికిత్స అందిస్తున్నట్లు ఆయా కుటుంబీకులు తెలిపారు.

## తిలక్ వాకర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో సామూహిక వివాహ మహోత్సవం

**బెల్లంపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ శివాలయంలో ఆదివారం తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట స్వామి, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సేవే మార్గం.. ప్రేమే లక్ష్యం..

★ మానవసేవే మాధవసేవ..: శ్రీ శివరామ సాయి యూత్ వెల్ఫర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్

★ ప్రజా సేవే ఆయన ఊపిరిగా, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

★ నేటి యువతకు మార్గదర్శం



కెరమెరి మండలంలో పిడుగు పాటుతో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న యూత్ సభ్యులు

చింతలమానేపల్లి, ప్రభాతవార్త

*కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజక వర్గం చింతలమానెపల్లి మండలం డబ్బా బారేగుడ గ్రామానికి చెందిన యువకుడు గుర్లే శ్రీనివాస్ 14 మంది యువకులతో యూత్ కమిటీ ఏర్పాటు చేసి 2012 నవంబర్ 28 రోజున శ్రీ శివరామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ (రి.నెం. 577 2012) సంస్థను ఏర్పాటు చేశారు. సేవే మార్గం ప్రేమే లక్ష్యం, మానవ సేవే మాధవ సేవా అని ముందుకు వెళుతున్న యూత్ కమిటీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ సిర్పూర్ తదితర మండలాలన్నింటిలోనూ యూత్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.గత 13 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపట్టిన వివిధ రకాల కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, వాటిపై అవగాహన కల్పిస్తున్నారు...*



దహెగాం మండలంలో ఓ అనాధ వృద్ధున్ని ఆశ్రమానికి తరలిస్తున్న యూత్ సభ్యులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హరితహారం తదితర కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారంలో భాగంగా పచ్చదనం స్వచ్ఛదనంలో మొక్కలు నాటడమే కాకుండా నాటిన మొక్కల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి, వాటిని కాపాడుతున్నారు. మారుమూల గ్రామాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూనే ఉన్నారు.

## ఆడబిడ్డలకు బతుకమ్మ సంబరాలకు చేయూత..

బతుకమ్మ సంబరాల్లో భాగంగా ప్రతిసంవత్సరం యూత్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించి మహిళలకు బహుమతులు ప్రధానం చేస్తూ చీర సరీలు అందజేస్తున్నారు.



కలెక్టర్ వెంకటేష్‌దోత్రేకు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవ కార్యాక్రమాల ఫైల్ అందిస్తున్న యూత్ అధ్యక్షుడు



ఆడ బిడ్డలకు బహుమతులు ప్రదానం చేస్తున్న యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్

## రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి రక్తదానం చేసి ప్రాణంకాపాడుతారు. అంతేకాకుండా రక్తదాన శిబిరాలు నిర్వహించి వాటిపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులుగా చేస్తున్నారు. ఎండాకాలంలో ప్రయాణికులకు దాహం తీర్చేందుకు ప్రతి సంవత్సరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. చింతలమానెపల్లి మండలం డబ్బా బారెగుడ గ్రామంలో సొంత డబ్బులతో ట్రాక్టర్ల ద్వారా మొరం వేసి చదును చేయించారు.

## నిరుపేద విద్యార్థులకు చేయూత..

విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేసి, ఉచితంగా ట్యూషన్ తరగతులు నిర్వహించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు. డబ్బా గ్రామంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లేందుకు విద్యార్థుల పరీక్షలు పూర్తి అయ్యేవరకు సొంత ఖర్చులతో రెండు ఆటోలు ఎర్పాటు చేశారు. నిరక్షరాస్యులకు పలకలు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేసి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తల్లితండ్రులు లేని పేద పిల్లలను మరియు పేద విద్యార్థులను హాట్లళ్లలో చేర్పించి బ్యాగ్ లు నోట్ బుక్కులు పెన్నులతో సహా అన్ని రకాల సామాగ్రిని అందించి పేద విద్యార్థులను విద్యావంతులుగా చేసేందుకు తోడ్పడుతున్నారుయూత్ సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి చర్చిస్తారు. అనంతరం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపి ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.





ఇంటిని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడం..

క్రీడాకారులను ప్రోత్స హించేందుకు యూత్ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గత పదమూడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లను గుర్తించి వారికి వాలీబాల్, క్యారం, క్రికెట్ కిట్లను అందజేసి వారిని ప్రోత్సహిస్తున్నారు.

శ్రీ శివరామ సాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు స్థానికులు యూత్ సభ్యులను ప్రశంసిస్తున్నారు. ఎవరి నుంచి ఏమీ ఆశించకుండా స్వచ్ఛందంగా, సొంత ఖర్చులతో ఈ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రోజు కూలీ పనులు చేసిన డబ్బుతో ఎంతో కొంత జమ చేసుకొని ఈ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గానీ ప్రభుత్వాల అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గానీ తమకు సహాయ సహకారాలు అందించి తమయూత్ సభ్యులను ప్రోత్సహిస్తే మరిన్ని మంచి సేవా కార్యక్రమాలు చేపడుతామని యూత్ అధ్యక్షుడు గుర్లెశ్రీనివాస్ తెలిపారు.

# శ్రావణిని హత్య చేసిన కులోన్మాదులకు కఠిన శిక్షలు పడాలి

**- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతయ్య**

కెరమెరి, అక్టోబర్ 26, ప్రభాతవార్త

శ్రావణి హత్య చేసిన కులోన్మాదులకు శిక్షలు పడాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతయ్య అన్నారు. కుర౦భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామానికి చెందిన తలాండి శ్రావణిని ఈనెల 18న శనివారం రోజున ఆమె భర్త తండ్రి సత్తయ్య ఆమె ఇంట్లోకి వెళ్లి ఆమెను కత్తితో పొడిచి, గొడ్డలితో నరికి దారుణంగా హత్య చేశాడు. 9 నెలలు గర్భవతి ప్రసవానికి సిద్ధంగా ఉన్న శ్రావణిని సత్తయ్య, అతని పెద్ద కొడుకు, కోడలు కలిసి దారుణంగా హత్య చేశారని, వారికి శ్రావణి భర్త శేఖర్ సహకరించాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సరిగ్గా సంవత్సరం క్రితం బీసీ బెస్త కులానికి చెందిన సత్తయ్య కుమారుడు శేఖర్, అత్యంత వెనుకబడిన ఆదివాసి పిటివిటిజి తెగ అయిన పర్ధాన్ (డోల) కులానికి చెందిన శ్రావణి కలిసి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ కులాంతర వివాహం నచ్చని సత్తయ్య కుటుంబం ఆరోజు నుండి శ్రావణిపై కక్ష పెంచుకున్నారు. కొంతకాలం శ్రావణితో సఖ్యంగానే ఉన్న శేఖర్ క్రమంగా తన తల్లిదండ్రుల పక్షం చేరి, శ్రావణిని వదిలించుకోవాలని ఈ హత్యలో భాగం పంచుకున్నాడని శ్రావణి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కేవలం కులాలు వేరైనందువల్ల మాత్రమే ఈ హత్య చేశారని వారు ఆరోపిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో శ్రావణి ప్రసవిస్తే ఈ వివాహాన్ని రద్దు చేయించడం ఇంకా కష్టమవుతుందని, ఆమె డెలివరీ కాకముందే, ఆమెను అడ్డు తొలగించుకోవాలని, తల్లి దండ్రుల ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రావణిని, ఆమెతోపాటు



కడుపులో ఉన్న పిండాన్ని కూడా కత్తితో పొడిచి మరీ చంపారు. సమాజంలో కులపిచ్చి తగ్గకపోగా పెరుగుతూ, మనుషులను జంతువుల కంటే హీనస్థాయికి దిగజారుస్తున్నదనటానికి ఈ హత్య అతి పెద్ద సాక్ష్యం. నిజానికి, మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న గెర్రె గ్రామంలో కులాంతర వివాహాలు కొత్త కాదు. రెండు మూడు తరాలుగా చాలామంది అలా చేసుకుంటున్నారు. అందులో భాగంగానే శ్రావణి, అలాగే ఆమె అన్న కూడా సాహసం చేసి, ఇది ఆధునిక, మరింత నాగరిక కాలం అని నమ్మి అటువంటి కులాంతర వివాహం చేసుకున్నారు. కానీ, సమాజంలో కులమతాల పిచ్చి పెరిగి, కుల మతాంతర వివాహితుల హత్యలు పెరుగుతున్నాయని ఆమె ఊహించలేకపోయింది. కులమతాల పరిధి దాటి వివాహాలు చేసుకుంటున్న యువతీ యువకులు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున హత్యలకు గురవుతున్నారు. ప్రభుత్వము, పోలీసులు, సమాజం అటువంటి వారికి ఏ రకమైన రక్షణలు ఇవ్వలేకపోతున్నది. ఒక్కరోజు సంచలన వార్తగా మారి, వారి జీవితాలు అంతమవుతున్నాయి. శ్రావణిని పాశవికంగా హత్య చేసిన సత్తయ్యతో పాటు, హత్యలో భాగం పంచుకున్న నేరస్తులెవరూ తప్పించుకోకుండా, అందరికీ తగిన శిక్షలు పడేంతవరకు సాక్ష్యాధారాల సేకరణ, బాధితులకు న్యాయ సహాయం వంటి బాధ్యతలను ప్రభుత్వమే ప్రత్యేకంగా తీసుకోవాలి. శ్రావణి తల్లిదండ్రులకు ఎస్సీ,ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం అందే ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలి. ఈ తరహా కులోన్మాద హత్యలు, నేరాల వేగవంతమైన విచారణకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి. కుల, మతాంతర వివాహితుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాన్ని చేయాలి. మా నిజనిర్ధారణ బృందంలో మానవ హక్కుల వేదిక ఆసిఫాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు సుజాయత్ ఖాన్, రాష్ట్ర సభ్యులు ఎండి అన్వర్, కె. బక్కయ్య, వి. దిలీప్, ఎస్ అమృత్ కుమార్‌లు పాల్గొన్నారు.



## క్రికెట్ పోటీ విజేతలకు ఎమ్మెల్యే బహుమతి ప్రధానోత్సవం

సారంగాపూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

మండలంలోని జాం గ్రామంలో ప్రీమియర్ లీగ్ పోటీలు గత నాలుగు రోజు ఇరు జట్ల మధ్య జరిగినాయి. ఆదివారం ఫైనల్ పోటీకి స్వర్ణ, రాంసింగ్ తండా గ్రామాల జట్టులు ఆడగా అందులో రాంసింగ్ తండా జట్టు మొదటి బహుమతి గెలువగా. రెండవ బహుమతిగా స్వర్ణ జట్టు నిలిచినది. విజేతలను బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బహుమతికి ప్రధానం చేశారు. ఇందులో మొదటి విజేతకు ట్రోఫీతో 20 వేల నగదు, రన్నరప్‌గా స్వర్ణ గ్రామ జట్టుకు ట్రోఫీతో 10 వేల నగదు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చంద్రప్రకాష్ గౌడ్, తక్కల రమణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, మండల అధ్యక్షులు నరేష్, నాయకులు రాంశంకర్ రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్ రావ్, మండల ఉపాధ్యక్షులు తిరుమల చారి, చెన్న రాజేశ్వర్, రాజలింగం, లింగారెడ్డి తో పాటు మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లో చేరిన వ్యక్తులు కాంగ్రెస్ కార్యకర్తలు కాదు

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుసుంరావు**

కెరమెరి, అక్టోబర్ 26, ప్రభాతవార్త



అనార్‌పల్లి, తుమ్మగూడ, గొర్యాగూడ, గ్రామాల వ్యక్తులు శనివారం టీఆర్ఎస్ పార్టీలో చేరినవారు అసలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే కారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుసుంరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ, కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీలో చేరినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీ చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక తప్పుడు మాటలు చెప్పినారు అన్నారు. ఈ కార్యక్రమంలో అనార్పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శంకర్ నాయక్, కెరమెరి పార్టీ నాయకులు ఉత్తం నాయక్, రవీందర్, సుదర్శన్, ధరమ్ సింగ్, కొట్నంగి, తిరుపతి, మొహర్లా నగేష్, విశ్వనాథ్, తిరుపతి తదితరులున్నారు.

## ప్రతిభా అవార్డు అందుకున్న బెల్లంపల్లి విద్యార్థులు

బెల్లంపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త

ఆదివారం రోజున హైదరాబాద్‌లో విప్ ఫౌండేషన్ జోన్ 16 తెలంగాణా ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం లక్డీకాపూల్‌లో ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా మరియు బి.టెక్ విభాగాల్లో 90 శాతంతో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రతిభా అవార్డులతో సత్కరించారు. ఇందులో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన బి.టెక్ మొదటి సంవత్సరంలో 9.88 జీపీఏతో ఉత్తీర్ణులైన వారిలో, వశిష్ట్ పాండే, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తెలంగాణా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల షేక్‌పేట్ సీవోఈ నుండి 99 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ప్రథమ్ పాండే, ఇంటర్మీడియట్‌లో 90 శాతం జీపీఏ తో ఉత్తీర్ణులైన ఛవి శర్మలను కండువా కప్పి ప్రతిభా అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ 16 విప్ ఫౌండేషన్ అధ్యక్షుడు హరికిషన్ ఓజా, మంత్రి రామ్‌దేవ్ నాగ్లా, కోఆర్డినేటర్ ఆనంద్ శర్మ ఇతర సభ్యులు పాల్గొన్నారు.




## బాల్యవివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తాయి

ఆసిఫాబాద్, అక్టోబర్ 26, ప్రభాతవార్త

బాల్యవివాహాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తాయని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని టీఆర్ నగర్‌లో మైనర్ బాలికకు వివాహ నిశ్చితార్థం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్ (1098) బృందం, పోలీసు శాఖ సిబ్బంది సమన్వయంతో అక్కడికి చేరుకుని ఆ కార్యక్రమాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిసిపిఓ. మాట్లాడుతూ మైనర్లకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని, నేరమని వివరించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలని, బాల్యవివాహం నిర్వహించిన వారు 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం లక్ష రూపాయల జరిమానా, జైలు శిక్షకు గురవుతారని సూచించారు. ఇలాంటి వివాహాల్లో పాల్గొన్న పెద్దలు, పురోహితులు, బంధువులు, పెళ్లి కుమారుడు వారి కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్య, ఆరోగ్యం, సురక్షిత వాతావరణం కల్పించి పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, పెద్దలు భరోసా కల్పించాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి సమాచారం అందించాలని సూచించారు.అనంతరం సంబంధిత బాలికను కౌన్సిలింగ్ నిమిత్తం సఖి కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ ర్యూన్నీ రాణి, కానిస్టేబుల్ సంతోష్, కాంతమ్మ పాల్గొన్నారు.

## కార్మికుల శ్రేయస్సు కోరి ప్రతి పోరాటంలో పాల్గొంటాం

**- ఎస్పీయం ట్రేడ్ యూనియన్ నెంబర్ ఇ966కు రాజీనామా**

**- బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావు**

కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 26 ప్రభాతవార్త

సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల శ్రేయస్సు కోరి ప్రతి పోరాటంలో పాల్గొంటామని బీఆర్ఎస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావు అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం కోసిని ప్రాణహిత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా ఎస్పీయం ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ966కు అధ్యక్షులుగా ఉన్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న తాను పనిచేశామని అన్నారు. అనివార్య కారణాల వల్ల, కార్మికుల ఆదేశానుసారం, సూచనల మేరకు కూడా ఇ966 కు రాజీనామాను ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల కోరిక మేరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలోనే సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మికులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇ966 నెంబర్‌కు రాజీనామా చేసిన చేసి సిర్పూర్ పేపర్ మిల్స్ ఎంప్లాయిస్ ప్రొటెక్షన్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ ఇ2381తో కలిసి కార్మిక సమస్యల కోసం పోరాటం చేయడానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాలతో నిర్ణయించుకోవడం జరిగిందని రేపటినుండి కార్మికుల శ్రేయస్సు కోరి ప్రతి పోరాటంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వాన్ని బలపరుస్తూ పాల్గొంటామని లెండుగురె శ్యామ్‌రావు తెలిపారు. కార్మికుల కోరిక మేరకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో ఇ2381 ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో రాబోయే సిర్పూర్ పేపర్ మిల్లు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, కార్మికులందరూ తమవైపు ఉన్నారని ఎస్పియం కార్మికులకు తప్పకుండా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ న్యాయం చేస్తారని తెలిపారు.



# అన్ని వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయం

## - ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**తిర్యాని, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

అన్ని సామాజిక వర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీ ధ్యేయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం తిర్యాని మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీలోని పెరిక సంఘ భవనానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆయా సామాజిక వర్గాలకు కమిటీ హాల్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఆ పనులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. డిఎంఎఫ్టి, సిఎస్ఆర్ నిధుల నుండి కమిటీ హాల్ నిర్మాణం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. మండలంలో అంతర్గత రోడ్ల మరమ్మతుల కోసం 50 లక్షల నిధులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. మండలంలో ప్రధాన సమస్య అయిన తిర్యాని నుండి త్రీ ఇంక్లైన్ రోడ్డును డబుల్ రోడ్డు మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పెరిక సంఘం భవనానికి భూమి దానం చేసిన భూమి యజమానిని మల్లేష్ ను ఆమే అభినందించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలిందిగా పార్టీ అధ్యక్షులు జగదీష్‌ను కోరారు. అనంతరం పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యం రాజయ్య ఎమ్మెల్యే కోవలక్ష్మి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ టెంట్ శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసిలు ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యూత్ సభ్యులు, పెరిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయం



**లక్షెట్టిపేట, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు... లక్షెట్టిపేట మార్కెట్ (వ్యవసాయ) యాడ్ రైతు వేదికలో దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయకనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు 95 మంది లబ్దిదారులకు 2904000 రూపాయల చెక్కులను లబ్దిదారులకు అందజేసిన మంచిర్యాల జిల్లా ఆర్టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, లక్షెట్టిపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వల్ప అనారోగ్య కారణంగా అందుబాటులో లేకున్నా కూడా నియోజక వర్గ ప్రజల గురించి నిరంతరం ఆలోచిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ప్రజలకు అందించాలని సూచించి ప్రజల యోగ, క్షేమాలు తెలుసుకుంటున్నారన్నారు. అధికారులతో ఫోన్‌లో అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆదేశాలిస్తున్నారాని అలాంటి మంచి వ్యక్తిపై విమర్శకులు ఆరోగ్యం బాగోలేదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అలాంటి వారి మాటలు ఎవరూ నమ్మవద్దని కోరారు. ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యంగా ఉన్నారని, మరో కొద్ది రోజులలో నియోజకవర్గానికి వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్, మండల అధ్యక్షులు పింగిలి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తోట రవి, రవీందర్రావు, మాజీ ఎంపీటీసీ స్వామి, మండల పట్టణ తాజా మాజీ ప్రతినిధులు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెడ్మ రాము ఆశయ సాధనకు కృషి చేయాలి

## ఏదులపాడ్‌లో ఘనంగా వెడ్మ రాము వర్ధంతి

**తిర్యాని, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

వెడ్మ రాము ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు లు అన్నారు. ఆదివారం తిర్యాని మండలంలోని ఎదులాపాడ్ గ్రామంలో నిర్వహించిన వెడ్మ రాము 38వ వర్ధంతి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథితులుగా హజరయి వెడ్మ రాము విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా ఆదివాసీ గిరిజన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వెడ్మ రాము త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజనుల ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు వెడ్మ రాము అని వారి ఆశయాలను, పోరాట స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏదులపాడ్‌లో రాము నిలువెత్తు విగ్రహం ఏర్పాటుతో పాటు స్మృతివనం రోడ్డు, మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అనంతరం తోటి సంఘం నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిడి రమాదేవి, జిసిడిఓ శకుంతల, ఏటిడిఓ చిరంజీవి, గిరిజన క్రీడల జిల్లా అధికారి మడావి షేకు, ఎస్సై వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్ గౌడ్, బీఆర్ఎస్ పార్టి జిల్లా నాయకులు హన్మండ్ల జగదీష్, పివిటీజి గౌరవ అధ్యక్షులు చహకటి దస్రు, రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం భీంరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పెందుర్ ఆనంద్ రావు, రాష్ట్ర అధ్యక్షులు మర్సుకొల తిరుపతి, ప్రధాన కార్యదర్శి తోడసం శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రజిడెంట్ ఆత్రం సంతోష్, పీవిటీజి జిల్లా ప్రధాన కార్యదర్శి చహకటి వెంకటేష్, వెడ్మ రాము వారసులు మెంగు, శంకర్, వెంకటేష్, రవి, తిరుపతి, రాము, ఆదివాసీ నాయకులు కుర్సెంగ మోతిరాం, గిరిజన సంఘాల పెద్దలు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# నిస్వార్థ సేవ చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

**- మంచిర్యాల జిల్లా సహా కార్యవాహ కందికంటి శ్రీనివాస్**

**తాండూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

విపత్కర పరిస్థితులలో ప్రభుత్వ యంత్రాంగం కంటే స్వయం సేవకులు ముందే చేరుకొని బాధితులకు నిస్వార్థ సేవ చేయడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రధాన లక్ష్యమని ఆర్ఎస్ఎస్ మంచిర్యాల జిల్లా సహా కార్యవాహ కందికంటి శ్రీనివాస్ అన్నారు. తాండూర్ ఖండ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను స్థానిక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత, ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేబి హేడ్గేవార్, ఎం.ఎస్.గోల్వాల్కర్ చిత్రపటాలతో గణ వేషధారులైన సంఘ్ స్వయం సేవకులు స్థానిక విద్యా భారతి ఉన్నత పాఠశాల నుండి ఐబి జాతీయ రహదారి గుండా పాఠశాల వరకు పథ సంచలన్ (కవాతు) నిర్వహించారు. కవాతులో స్వయం సేవకులు ఆలపించిన దేశభక్తి గీతాలు మార్మోగాయి. అనంతరం పాఠశాల ఆవరణ సమావేశంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత మాత, డాక్టర్ కేబి హేడ్గేవార్, ఎం.ఎస్.గోల్వాల్కర్ చిత్రపటాలకు ప్రముఖులు పూలమాలలు వేశారు. అనంతరం సంఘ్ స్వయం సేవకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హిందూ సమాజాన్ని ఏకం చేయడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే లక్ష్యంగా 1925లో డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ నాగపూర్ లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ను స్థాపించడం జరిగిందన్నారు. స్వయం సేవకులు సంఘ్ ను గ్రామ గ్రామాన విస్తరించాలని, దేశాభివృద్ధి కోసం పాటుపడాలని, హిందూ సమాజాన్ని జాగృతం, సేవా వంటి కార్యక్రమాలు చేయడంలో నిరంతరం ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల కోసం రాష్ట్ర సేవికా సమితి వంటి అనేక అనుబంధ సంస్థలు పని చేస్తున్నయన్నారు. కార్యక్రమంలో విద్యా భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు సురభి ఆగమరావు, ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహకార్యవాహ మాధవరం రంగస్వామి, కండ ప్రముఖులు వేణు, శేఖర్, రాజేంద్రప్రసాద్, అశోక్, చందు, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.






# ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**వేమనపల్లి, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

నాగారం గ్రామంలో ఆదివారం శ్రీ భక్త వీరాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామస్తులు, వివిధ పార్టీల ముఖ్య నాయకుల సమక్షంలో వేద పండితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక, భక్తిభావం పెరుగుతుందన్నారు. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తలండి భీమయ్య, ముల్కల్ల సత్యనారాయణ, ముల్కల్ల పెద్ద రాజన్న, బుర్సా పోషం, దూల చంద్రయ్య, దొంతుల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంఘ భవనం కోసం వినతిపత్రం

**సారంగాపూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘ సభ్యులు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమకు గ్రామంలో కుల సంఘ భవన లేదు. మాకు సంఘ భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయాలని వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తొందరలోనే సంఘ భవనానికి నిధులు కేటాయింపు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మధు, మున్నూరు కాపు సంఘ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# మహాలక్ష్మి అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠపన

**సారంగాపూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

మండలంలోని చించోలి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విడిసి సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నరేష్, నాయకులు తక్కల రమణ రెడ్డి, రాంశంకర్ రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్ రావ్, గంగాధర్, వెంకటేష్, జమాల్, మైస శేఖర్, కార్తీక్, ముత్యం, లక్ష్మణ్, గంగాధర్, లింగారెడ్డి, విడిసి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.






# పలు కార్యక్రమలకు హాజరైన మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి

**సారంగాపూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

మండలంలోని పలు వివాహాలకు హాజరైనాడు. మండలంలోని జవులి గ్రామనికి చెందిన మద్దూరి వారి వివాహని హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండలం కౌట్ల (బి) గ్రామానికి చెందిన దాసరి సుజాత, గంగాధర్ కుమార్తె హాసిని (ప్రణవి) పెళ్ళికి, నాలం శ్రీనివాస్ (ఐ.కే.రెడ్డి,పి.ఏ) అన్న కూతురు వివాహానికి, నిర్మల్ గండి రామన్న సాయిబాబ టెంపుల్‌లో పలు పెళ్లిలకు హాజరై నూతన వధువరులను. సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆశీర్వదించినారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫొటోస్ ఎంబ్రాయిడరీ స్టోర్‌ను ప్రారంభించినాడు. ఈ కార్యక్రమంలో అడెల్లి ఆలయ దేవస్థాన టెంపుల్ చైర్మన్ సింగం భోజ గౌడ్, నాయకులు రేగుంట గంగాధర్, సారంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనం భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**

బాలసదనం భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాలసదనం భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ, ఆశ్రయం కొరకు ప్రభుత్వం 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనము భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ గుత్తేదారుల సమన్వయంతో నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# త్వరలో కాగజ్‌నగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

**- కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్**

**కాగజ్‌నగర్, అక్టోబర్ 26 ప్రభాతవార్త :**



పట్టణంలోని ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రరూపం దాల్చాయని పోలీసులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు త్వరలోనే ప్రత్యేక చర్యలు చేపడతామని కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ ప్రేమ్‌కుమార్ ప్రకటించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో షాపుల ముందు ఉన్న అనధికారిక బోర్డులు తొలగిస్తాం. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపేవారిపై చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా కఠినమైన చర్యలు చేపడతాం" అని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలను ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అనవసర పార్కింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో గిరిజన గ్రామాలు

**లింగాపూర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త**



మండలంలోని లొద్దిగూడ, దంపూర్, మోడీగూడ గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగా లేక రాకపోకలకు తప్పని తిప్పలు. గ్రామాల నుంచి నిత్యవసర సరుకుల కోసం, మండల కార్యాలయాల్లో పనుల కొరకు వెళ్లాలన్న రోడ్డు బాగాలేక వెళ్లడం చాలా కష్టంగా మారుతుంది. రోడ్డు బాగాలేక అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రిలకు చేరలేక ప్రాణాలు విడిచిన రోజులు కూడా ఉన్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల వాగ్దానాలు తప్ప అభివృద్ధి జరగడం లేదు. సంబంధిత అధికారులు త్వరగా స్పందించి మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలోని వివిధ గ్రామల ప్రజలు కోరుతున్నారు. లింగాపూర్ మండల కేంద్రం నుండి పంగిడి మాధోర వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే జిల్లా కేంద్రానికి వెళ్లడానికి చాలా దగ్గర పడుతుందని కోరుకుంటున్నారు.